
సాక్షి ఒడిశా

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 6,00,513
బంగారం : 40 మిల్లీ గ్రాములు
వెండి : 15 గ్రాముల 350 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



మాల్యవంత్ కలశ యాత్ర

మాల్యవంత్ కలశ యాత్ర ఘనంగా జరిగింది. వందలాదిగా పాల్గొన్నారు.

- 8లో



కొరాపుట్ పరబ్‌కు సిద్ధం

కొరాపుట్ పరబ్‌కు సర్వం సిద్ధమైంది. సీఎం హాజరయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయండి



డీజీపీతో ఎమ్మెల్యేలు కద్రక, సత్యజీత్

రాయగడ: పట్టణంలో మహిళా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగోలు కోరారు. ఈ మేరకు డీజీపీ జోగేష్ బహదూర్ ఖురానియాను ఆయన కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న రాయగడలో ప్రత్యేకమైన మహిళా పోలీస్‌స్టేషన్ ఆవశ్యకతపై చర్చించారు. అలాగే హై సెక్యూరిటీ సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పెట్రోలింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. దీనిలో భాగంగా సీపీఆర్ వాహనాలను ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. వీటిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటామని డీజీపీ తెలియజేశారు.

ఏనుగు దాడిలో యువకుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయగడ: ఏనుగు దాడిలో ఒక డొంగిరియా కొంధొ తెగకు చెందిన ఆదివాసీ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నియమగిరి పర్వత ప్రాంతమైన లేఖాపదర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు సమితిలోని పర్శాలి పంచాయతీ పరిధి ఖంబేసు గ్రామానికి చెందిన సాలుపు కుత్రకగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కల్యాణ సింగుపూర్ రేంజర్ చందన్ గొమాంగో, ఇతర అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అధ్యయనం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సాలుపు కుత్రక అనే యువకుడు శుక్రవారం రాత్రి తన పంటపొలాల వద్ద కాపలా కాశాడు. ఈ క్రమంలో ఏనుగు రాత్రి చొరబడింది. దీంతో భయపడి సాలువ పరుగులు తీశాడు. అయితే ఏనుగు వెంబడించి అతనిని హతమార్చింది. ఏనుగు దాడిలో మృతి చెందిన కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు అటవీ శాఖ అధికారులను కోరుతున్నారు.

వ్యాన్ ప్రమాదంలో ఆరుకి చేరిన మృతుల సంఖ్య

పర్లాకిమిడి: ఈ నెల 11న గజపతి జిల్లాలో మోహన బ్లాక్ చంద్రగిరి పోలీసుస్టేషన్ పరిధిలో చిటింగ్ ఘాటీ వద్ద మ్యాక్స్ పికప్ వ్యాను అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని బరంపురం ప్రభుత్వ మెడికల్‌కు తరలించారు. వారిలో మరో నలుగురు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 6కు చేరుకుంది. చంద్రగిరి పీఎస్ పరిధిలోని కేకేసింగి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అయితే చనిపోయిన వారు అతిపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో ప్రభుత్వం వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మల్కన్‌గిరి-మొహిర్‌బంద్‌కు ఆరు లేన్ల రహదారి



మాట్లాడుతున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం మోహన్ చరణ్ మాఝి మాట్లాడుతూ మల్కన్‌గిరి నుంచి మొహిర్‌బంజ్ వరకు 6 లేన్ల రహదారి నిర్మిస్తామని తెలిపారు. పోడియ సమితిలో డాల్మియా సిమెంట్ కంపెనీ నిర్మాణం పూర్తి చేస్తామని, రైల్ లైన్ మల్కన్‌గిరి నుంచి ఖమ్మం, మల్కన్‌గిరి నుంచి జయపురం వరకు రైల్ లైన్ పూర్తి చేస్తామన్నారు. టీచర్ల కొరత ఉంటే భర్తీ చేస్తామని తెలిపారు. లైవ్‌లి ఉడ్ మిషన్ పథకం ద్వారా జిల్లాలో ఉన్న ప్రతి గిరిజనుడికీ ఉపాధి కల్పిస్తామన్నారు. మల్కన్‌గిరి అభివృద్ధికి గాను రూ.4వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన శాఖ మంత్రి నిత్యానందో గోండో, మల్కన్‌గిరి కలెక్టర్ ఆశీష్ పటేల్, నవరంగ్‌పూర్ ఎంపీ బోలభొద్ర మాఝి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖిలో తదితరులు పాల్గొన్నారు.

మహానది జలాలపై.. కొత్త ఆశలు

- ఒడిశా, చత్తీస్‌గఢ్ మధ్య సమతుల్యతపై ఉత్కంఠ
- ట్రిబ్యునల్ కొత్త చైర్‌పర్సన్ నియామకం



జస్టిస్ బేలా ఎం.త్రివేది, మహానది జల వివాద ట్రిబ్యునల్ చైర్‌పర్సన్



కటక్ ప్రాంతంలో మహా నది సోయగం

భువనేశ్వర్: మహానది జలాల పంపిణీ వివాదం పరిష్కృతమై రాష్ట్రం ఆశలు నెరవేరుతాయని కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. దీర్ఘ కాలంగా చత్తీస్‌గఢ్‌తో మహానది జలాల పంపిణీ వివాదం కొనసాగుతోంది. ఇన్నాళ్లు ఈ రెండు రాష్ట్రాల్లో భిన్నమైన పార్టీలు అధికారంలో కొనసాగాయి. ప్రస్తుతం ఉభయ రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ పాలన కొనసాగుతోంది. దీంతో మహానది జలాల పంపిణీ వివాదం తొలగి రాష్ట్రం సశ్య శ్యామలం అవుతుందని భావిస్తున్నారు.

పరిష్కార సంకేతం

ఉభయ తారక ప్రామాణికంతో చత్తీస్‌గఢ్, ఒడిశా మధ్య మహా నది జలాల వివాదాన్ని పరిష్కరించే లక్ష్యంతో మహానది జల వివాద ట్రిబ్యునల్‌కు కొత్త చైర్‌పర్సన్‌గా జస్టిస్ బేలా ఎం. త్రివేది నియమితులయ్యారు. లోగడ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎ.ఎం. ఖాన్విల్కర్ ఈ ట్రిబ్యునల్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు సుప్రీం కోర్టు ఆదేశాలతో 2018 సంవత్సరంలో మహా నది జలాల పంపిణీ వివాద ట్రిబ్యునల్ ఏర్పాటైంది. ఈ నదీ జలాలపై ఆధారపడుతున్న ఇరుగు పొరుగు రాష్ట్రాల మధ్య వివాదాస్పద నీటి భాగస్వామ్య విభేదాలను కొత్త చెర్‌పర్సన్ ఆధ్వర్యంలో పరిష్కారం రాజకీయంగా సుసాధ్యమనే నమ్మకం సర్వత్రా వ్యక్తం అవుతుంది.

జీవన ఆధారం

రాష్ట్రానికి మహా నది జీవన ఆధారం. ఈ నదీ జలాలపై సాగు, పారిశ్రామిక ఇతరతేర దైనందిన సామాజిక, ఆర్థిక రంగాల మనుగడకు మహా నది జీవన రేఖగా ప్రవహిస్తుంది. ఎగువన చత్తీస్‌గఢ్ ప్రభుత్వం మహా నదిపై అక్రమంగా బ్యారేజీలు నిర్మించడంతో దిగువ ఒడిశాకు నీటి ప్రవాహం దిగజారి రాష్ట్రానికి ఈ నది నీటి వనరులు క్రమంగా క్షీణిస్తున్నాయి. దీంతో ఈ రెండు రాష్ట్రాల మధ్య అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదం చోటు చేసుకుంది. చట్ట ప్రకారం ఛత్తీస్‌గఢ్, ఒడిశా మధ్య మహా నది నీటి పంపిణీలో అసమానతలను తొలగించేందుకు మార్గం సుగమం చేయాలని రాష్ట్రంలో గత ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశాలతో ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పడింది. మహా నదీ జలాల నిష్పాక్షిక వనరుల కేటాయింపు, రెండు రాష్ట్రాల మధ్య సామరస్యాన్ని కొనసాగించేందుకు ఈ ట్రిబ్యునల్ మార్గదర్శకం ఆవిష్కరించాల్సి ఉంది.

జస్టిస్ బేలా ఎం. త్రివేది సారథ్యం

ట్రిబ్యునల్ కొత్త అధ్యక్షురాలిగా నియమితులైన జస్టిస్ బేలా ఎం.త్రివేది ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య మహా నది జలాల పంపిణీ వివాదానికి తెర దించుతారని భావిస్తున్నారు. రాజకీయ విభేధాల అడ్డంకి తొలగడం తొలి విజయంగా పరిగణిస్తున్నారు. జస్టిస్ బేలా ఎం.త్రివేది సారథ్యంలో నిష్పాక్షికమైన దృక్పథంతో వివాదం సంక్లిష్టతలను సునాయాసంగా అధిగమించేందుకు అనుకూల పరిస్థితులు గోచరిస్తున్నాయి. వివాదంతో మహా నది జలాల కోసం తలపడుతున్న రెండు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ పాలన కొనసాగడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. జస్టిస్ త్రివేది దిశ, నిర్దేశాలు రాష్ట్రంలో మోహన్ చరణ్ మాఝి సర్కారుకు పెద్ద సవాలు. ఆమె ఆధ్వర్యంలో ట్రిబ్యునల్ నిర్ణయాలు ఎలా ప్రభావితం చేస్తాయోననే ఉత్కంఠ ఉంది. ట్రిబ్యునల్ వైఖరి చట్ట పరంగా పరిమితం కాకుండా రాజకీయ ప్రాధాన్యతని రంగరించుకుంది. తుది తీర్మానం జాతీయ స్థాయిలో నదీ జలాల వనరుల సుస్థిర నిర్వహణకు కీలకమైన చర్యగా మార్గదర్శకం అవుతుందని భావిస్తున్నారు.

ఆశలు నెరవేరేనా..?

ఆశలు నెరవేరితే మహా నది లోతట్టు ఒడిశా ప్రకృతి సహజమైన మహా నది జల వనరులతో సశ్య శ్యామలం కావడంతో పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాల్లో బహుముఖంగా లబ్ధి పొందగలుగుతుంది. ఈ ఆశయ సిద్ధి కోసం గతంలో చేపట్టిన మధ్యవర్తిత్వం బెడిసి కొట్టింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వం సుప్రీం కోర్టుని ఆశ్రయించడంతో మహా నది జలాల పంపిణీ వివాదం ట్రిబ్యునల్ ఆవిర్భవించింది.

బహుచరి మాత పూజలు ప్రారంభం



పూజా సామగ్రితో ట్రాన్స్‌జెండర్లు



బహుచరి మాత

రాయగడ: ట్రాన్స్‌జెండర్ల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్న బహుచరి మాత పూజలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక కేఎన్‌కే సమీపంలోని మైదానంలో ప్రారంభమైన ఈ పూజలు సోమవారంతో ముగుస్తాయని ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ రాయగడ శాఖ అధ్యక్షులు కె.కాజల్ తెలియజేశారు. ముందుగా అమ్మవారి వేదిక వద్దకు పండ్లు, పువ్వులు, పూజా సామగ్రిలను ట్రాన్స్‌జెండర్స్ తీసుకెళ్లి, ఊరేగింపుగా వేదిక వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. గత ఏడేళ్లుగా ఈ పూజలను నిర్వహిస్తున్నట్లు కాజల్ తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్యం బాగుండాలని అమ్మవారికి ప్రతీ ఏడాది ఈ తరహా పూజలు చేస్తుంటామని పేర్కొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



డబుల్స్‌లో క్రీడాకారులు



సింగిల్స్‌లో రాణిస్తున్న క్రీడాకారుడు

రాయగడ: చైతీ క్రీడోత్సవాల్లో స్థానిక ఎస్పీ కార్యాలయం సమీపంలో గల ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో భాగంగా మెన్స్ డబుల్స్‌లో జాక్సన్ పలక, సుదీప్తి మహాపాత్రోలు విజేతలుగా నిలవగా రన్నర్స్‌గా డి.మణికంఠ, పి.చక్రవర్తి, అలాగే ఉమెన్స్ డబుల్స్‌లో లిపిక గొలాని, సైనా తాండిలు రన్నర్స్ స్థానాన్ని సంపాదించుకోగా విన్నర్స్‌గా దీప్తి పండ, ఎం.భార్గవిలు నిలిచారు. బాయ్స్ డబుల్స్‌లో ఆర్యమాన్ రథొ, ఆదిత్య పండలు విన్నర్స్ స్థానాన్ని గెలుచుకోగా రన్నర్స్‌గా సుభమ్ బాగ్, నమన్ జైన్‌లు నిలిచారు. విజేతలకు ఈ నెల 26న స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న చైతీ జిల్లా స్థాయి పోటీల్లో బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

కళలకు పుట్టినిల్లు ఒడిశా



చైతీ ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొమాంగో



ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు



నృత్య ప్రదర్శన



ఆదివాసీ వాయిద్యాన్ని మోగిస్తున్న కళాకారుడు

రాయగడ: భిన్న సంస్కృతులు గల మన రాష్ట్రం కళలకు పుట్టినిల్లు అని గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో అన్నారు. జిల్లాలోని చంద్రపూర్‌లో సమితి స్థాయి చైతీ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గొమాంగో మాట్లాడుతూ ఆదివాసీ, హరిజన సంస్కృతి, భాష, కళలకు ప్రతిరూపంగా నిలిచేవి చైతీ ఉత్సవాలని అన్నారు. ఆదివాసీల సంస్కృతికి అద్దం పట్టే ఈ ఉత్సవాలు ఈ ఏడాది అన్ని సమితుల్లో జిల్లా యంత్రాంగం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో గుణుపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడొ, బీడీఓ అశ్విని మాలిక్, సమితి సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



లంజియా సవర తెగ ఆదివాసీల నృత్య ప్రదర్శన



కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు



ఉత్సవాల్లో పాల్గొన్న జనం

పోలవరం వ్యతిరేక ఉద్యమం ఉద్ధృతం

- వచ్చే ఏడాది జనవరి నుంచి ఆరంభం
- మోటు నుంచి ఢిల్లీ వరకు పోరాడుతాం: బీజేడీ



నవీన్ పట్నాయక్ అధ్యక్షతన పోలవరం వ్యతిరేక ఉద్యమం వ్యూహ రచన



ప్రదీప్ మాఝి

భువనేశ్వర్: పోలవరం ప్రాజెక్టు వ్యతిరేకంగా రాష్ట్రంలో వ్యతిరేకత బలం పుంజుకుంటోంది. ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ ఈ ఉద్యమానికి నడుం బిగించింది. కొత్త సంవత్సరం ఆరంభం నుంచి బీజేడీ పోలవరం వ్యతిరేక ఉద్యమానికి శంఖారావం చేసింది. గోదావరి నదిపై బహుళ ప్రయోజనకర అంతర రాష్ట్ర ఆనకట్ట నిర్మాణాన్ని బీజేడీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 2025 జనవరి నుంచి వ్యతిరేక ఉద్యమం మల్కన్‌గిరి జిల్లా మోటు ప్రాంతం నుంచి ఢిల్లీ వరకు నిరవధికంగా కొనసాగిస్తామని పార్టీ నాయకుడు ప్రదీప్ మాఝి ఉద్ఘాటించారు. ఈ మేరకు బీజేడీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలవరం వ్యతిరేక ఉద్యమం వ్యూహరచనపై నాయకులకు అవగాహన కల్పించారు. ఆందోళనను తీవ్రతరం చేయడానికి ముందు పోలవరం ప్రాజెక్ట్ అంశంపై మల్కన్‌గిరి ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని నవీన్ పట్నాయక్ సూచించడం విశేషం.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో మల్కన్‌గిరి జిల్లా మోటు ప్రాంతంలోని దాదాపు 150 గ్రామాలు నీట మునిగిపోయే ముప్పు పొంచి ఉందని బీజేడీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ముప్పు తీవ్రతని విపక్ష బీజేడీ ప్రత్యేక టాస్కు ఫోర్సు క్షేత్ర స్థాయిలోని తాజా స్థితిగతులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం భావి వైపరీత్య పరిణామాల్ని విశ్లేషించి సమగ్ర నివేదిక సిద్ధం చేసింది.ఈ విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు కేంద్ర జల కమిషన్ దృష్టికి కూడా తీసుకెళ్లింది. ఈ ఏడాది జూలై, ఆగస్టు రెండు నెలల్లో మల్కన్‌గిరి జిల్లాలో పోలవరం ప్రభావిత ప్రాంతాల్ని బీజేడీ బృందం ప్రత్యక్షంగా సందర్శించింది. ఈ బృందం నివేదికని పరిశీలించిన మేరకు పోలవరం వ్యతిరేక ఉద్యమానికి బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ శంఖారావం చేశారు.

ముందస్తు సమాచారం

పోలవరం ప్రాజెక్టుతో మల్కన్‌గిరి జిల్లాలో జనావాసాలు నీట మునగక ముందే జాగ్రత్త వహించాలని బిజూ జనతా దళ్ 7 మంది సభ్యుల ప్రత్యేక టాస్కు ఫోర్సు ఇటీవల న్యూఢిల్లీకి వెళ్లి క్షేత్ర స్థాయిలో ముంపు అధ్యయనం నివేదికని కేంద్ర జలశక్తి మంత్రి, కేంద్ర జల కమిషను (సిడబ్ల్యుసి) ఛైర్మన్‌తో పాటు ఇతరులతో సమావేశమైంది.

డిజైను మార్పుతో ముప్పు

బిజూ జనతా దళ్ సుదీర్ఘ పాలనలో ఈ ప్రాజెక్టు ముప్పు పట్ల అనుబంధ వర్గాల్ని అనుక్షణం అప్రమత్తం చేసింది. బీజేడీ వైఖరిని పెడ చెవిన పెట్టి ప్రాజెక్టు పూర్తికి కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని విపక్షం ఆవేదన వ్యక్తం చేస్తుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రతిపాదిత ప్రణాళికలో భారీ మార్పు చేయడంతో ముప్పు చేరువైందని బీజేడీ ఆరోపణ. ఏకపక్షంగా డిజైన్ మార్పుతో వరద నీరు విడుదల పరిమితి 36 లక్షల క్యూసెక్కుల నుంచి 50 లక్షల క్యూసెక్కులకు పెంచారని బీజేడీ ఆరోపిస్తోంది. డిజైను మార్పు నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు ప్రభావిత మల్కన్‌గిరి, చత్తీసగఢ్ రాష్ట్రాల విపత్కర పరిణామాల్ని పరిగణనలోకి తీసుకోకుండానే ప్రాజెక్టు నమూనా రూపురేఖల్ని ఏకపక్షంగా మార్చేయడం తగదని బీజేడీ ఉద్యమానికి నడుం బిగించింది.

బీజేడీ డిమాండు

వరద నీటి విడదల పరిమితిలో మార్పు లేకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని బీజేడీ పట్టుబడుతోంది. ప్రతిపాదిత నమూనా ప్రకార వరద నీటి విడుదల గరిష్ట స్థాయి 150 అడుగులకు పరిమితం చేయడం అనివార్యం. ఆకస్మికంగా పోలవరం ప్రాజెక్టు డిజైన్ మార్చి వరద నీటి విడుదల గరిష్ట స్థాయి పరిమితి 174.22 అడుగులకు పెంచడంతో మల్కన్‌గిరి జిల్లాలో దాదాపు 150 గ్రామాలు నీట మునిగిపోతాయని బీజేడీ ఆందోళన వ్యక్తం చేస్తుంది.

45 వేల గంజాయి మొక్కలు ధ్వంసం



గంజాయి మొక్కలను తగలబెడుతున్న దృశ్యం




గంజాయి ధ్వంసంలో పాల్గొన్న ఎస్పీ స్వాతి తదితరులు

రాయగడ: జిల్లాలోని గుడారి ప్రాంతంలో గంజాయి సాగుపై ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఆధ్వర్యంలో ఎక్సైజ్, పోలీసులు శుక్రవారం దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా గుడారి పోలీస్‌స్టేషన్ పరిధి మధుబన్ పంచాయతీ గుంజుగుడ సమీపంలో నిర్వహించిన దాడుల్లో 45 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో సాగును నేలమట్టం చేసి తగలబెట్టారు.

క్లుప్తంగా

భీమారావుకు లేఖా భూషణ్ అవార్డు ప్రదానం



భీమారావుకు లేఖా భూషణ్ అవార్డు అందజేసిన శిష్టకరణ సంఘం జాతీయ శాఖ అధ్యక్షుడు డీవీ కృష్ణారావు

భువనేశ్వర్: వైజ్ఞానిక విద్యా రంగంలో నిరంతర పరిశోధకునిగా విశేష గుర్తింపు పొందిన స్థానిక రఘుపాత్రుని భీమారావుకు ఈ ఏడాది లేఖా భూషణ్ అవార్డు లభించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శిష్ట కరణ వేదికపై ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు డీవీ కృష్ణారావు అవార్డుని అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమారావు దంపతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వర్



మృతుడు రామ చంద్ర నాయక్ (ఫైల్)

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి భుజొబల్ సమీపంలో గల ఒక ధాన్యం మిల్లు ఎదురుగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తిని భుజబల్ గ్రామానికి చెందిన రామచంద్ర నాయక్ (61)గా చందిలి పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం రామచంద్ర నాయక్ ఎప్పటిలాగే మార్నింగ్ వాక్ చేస్తూ కొలనార వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈశ్వర్ ఉలక అనే వ్యక్తి తప్పతాగి బైకును డ్రైవ్ చేస్తూ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న నాయక్‌ను బలంగా ఢీ కొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన నాయక్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. బైక్ చోదకుడు ఈశ్వర్‌కు స్వల్పగాయాలు తగిలాయి. బైకు ఒక లోయలో పడిపోయింది. క్షతగాత్రుడు ఈశ్వర్‌ను పోలీసులు స్థానిక ఆస్పత్రిలో చేర్చారు.

ఆస్తి కోసం అన్నదమ్ముల కొట్లాట



చికిత్స పొందుతున్న రామ్మోహన్

టెక్కలి రూరల్: ఆస్తి కోసం అన్నదమ్ములు కొట్లాటకు దిగిన ఘటన శనివారం టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్లంగి గ్రామానికి చెందిన పిట్ట జానకిరామయ్య, పిట్ట రామ్మోహన్‌లు అన్నదమ్ములు. తల్లికి చెందిన 50 సెంట్ల భూమి విషయమై కొంతకాలంగా అన్నదమ్ముల మ ధ్య గొడవలు జరుగుతున్నాయి. కోర్టులో సైతం కేసులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తమ్ముడు రామ్మోహన్ సంబంధిత భూమిలో లాయర్ చెప్పారంటూ బోర్డును పాతాడు. విషయం తెలుసుకున్న అన్నయ్య జానకిరామయ్య తన కుమారుడు నవ్యక్రాంత్‌తో కలిసి శనివారం రామ్మోహన్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో తమ్ముడు లేకపోవడంతో అతని భార్య రాజేశ్వరితో గొ డవకు దిగారు. కొడవలితో రాజేశ్వరిని తీవ్రంగా గాయపరిచారు. అదే సమయంలో అక్క డికి చేరుకున్న రామ్మోహన్‌కు సైతం గాయాలయ్యాయి. ఈ గొడవలో జనకిరామయ్య, నవ్యక్రాంత్‌లు కూడా గాయపడ్డారు. గాయపడిన నలుగురినీ టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న టెక్కలి ఎస్ఐ రాము ఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

బైక్ ఢీకొని యువకుడు దుర్మరణం

కంచిలి: మండలంలోని కొన్నాయిపుట్టుగ పంచాయతీ సూదిపుట్టుగ గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన రమేష్ బెహరా(25) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. రమేష్ తలతంపర గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి కాలినడకన వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కవిటి మండలం బెజ్జిపుట్టుగకు చెందిన బొరివంక వీఆర్వో గుర్రాల దివాకర్ అతివేగంతో, అజాగ్రత్తగా బైక్ నడపటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. కాగా, రమేష్ చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఐదు నెలల క్రితమే వివాహమైంది. భార్య శ్యంతి బెహరా ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. భర్త మృతి విషయం తెలిసి కన్నీరుమున్నీరుగా విలపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్ మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కొరాపుట్ పరబ్‌కు సిద్ధం



ముఖ్యమంత్రికి బహూకరించాలని చిత్ర పటంతో పరబ్ వద్ద ఎదురు చూపులు



సీఎంకి వినతి పత్రం సమర్పిస్తున్న సీఎల్పీ నాయకుడు రాం ఖడం



వైభవంగా పరబ్ వేదిక



సీఎం రాక కోసం గిరిజనుల స్వాగత నృత్యాలు

కొరాపుట్: రాష్ట్రస్థాయి కొరాపుట్ జిల్లా గిరిజన సాంస్కృతిక ఉత్సవం పరబ్ వేడుకల్లో పాల్గొనేందుకు సీఎం మోహన్ చరణ్ మజ్జి కొరాపుట్‌కు చేరుకున్నారు. శనివారం సాయంత్రం మల్కన్‌గిరి జిల్లా నుంచి వాయు మార్గాన జయపుర్ చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాత్రికి కొరాపుట్ వచ్చారు. రాత్రి జరగనున్న పరబ్ వేడుకలను ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో కొరాపుట్ జిల్లా కేంద్రంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్ష నేత, పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్రఖడం సీఎంతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.



విజయవాడ నుంచి వచ్చి పరబ్ వద్ద బొమ్మల విక్రయాలు

మాల్యవంత్ కలశయాత్ర ప్రారంభం



జగన్నాథ స్వామి మందిరం నుంచి ప్రారంభమైన కలశయాత్ర



ప్రత్యేక ఆకర్షణగా కలహండి కట్టప్ప



ఊరేగింపులో విద్యార్థుల నృత్యాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో మాల్యవంత్ ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ కలశ పూజ చేసి యాత్ర ప్రారంభించారు. అనంతరం భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కలశ యాత్ర జగన్నాథ్ మందిరం నుంచి డీఎన్‌కే క్రీడామైదానం వద్ద మాల్యవంత్ ఉత్సవ్ మండపం వరకు సాగింది.

విద్యాభివృద్ధి ప్రాధాన్యం



దివ్యాంగ విద్యార్థితో మాట్లాడుతున్న మంత్రి బిభూతి భూషన్ జెన్నా



పాఠశాల వార్షికోత్సవానికి విచ్చేసిన మంత్రి బిభూతి భూషన్ జెన్నా

- రవాణా శాఖ మంత్రి బిభూతి భూషన్ జెన్నా

పర్లాకిమిడి: రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాసులు, ఈ-లైబ్రరీలు, సౌచాలయాలు నిర్మించడం జరిగిందని, దివ్యాంగులకు ఉచిత విద్యను అందిస్తూ వారికి నెలసరి భృతి అందజేస్తున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి బిభూతి భూషన్ జెన్నా అన్నారు. గజపతి జిల్లాలో రాయఘడ బ్లాక్ ప్రభుత్వ ఎస్.ఎస్.డి మాధ్యమిక ప్రాథమిక విద్యాలయం వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వార్షికోత్సవాన్ని మంత్రి ప్రారంభించారు. మాజీ ఎస్.డీ.సీ చైర్మన్ అంతర్యామి గోమాంగో, ముఖ్యవక్తలుగా సుభాషిణీ లక్ష్మణపండా మాట్లాడారు. సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ పీఓ అంశుమాన్ మహపాత్రో, మండల శిక్షాధికారి శ్యాం ఘణ భుయ్యాన్, బీజేపీ నాయకులు డుల్లు మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం సురేష్ సాహుకార్ పర్యవేక్షించారు. గసాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు.

నేడు ఆస్పత్రి భవనాల ప్రారంభం

జయపురం: జయపురం ఫూల్‌బెడలో నిర్మించిన జిల్లా కేంద్ర హాస్పిటల్ భవనాలను ముఖ్యమంత్రి మోహణ చంద్ర మఝీ ఆదివారం ప్రారంభించనున్నారు. కొరాపుట్ పర్వ్ ఆదివాసీ మహోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో కొత్తగా నిర్మించిన 300 పడకల భవనాలను, ఉద్యోగుల కోసం నిర్మించిన క్వార్టర్లను ప్రారంభిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేశాయి. కొరాపుట్ జిల్లా కేంద్ర హాస్పిటల్‌ను జయపురం తరలించే ప్రకటన చేసిన ప్రభుత్వం 26వ జాతీయ రహదారి జయపురం- బొరిగుమ్మ మార్గంలో ఫూల్‌బెడ గ్రామ ప్రాంతంలో గల మహిళా శిశు వైద్య కేంద్ర భవనాలకు 2019లో జిల్లా హాస్పిటల్ తరలించారు. జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు నూతన భవన నిర్మాణం చేపట్టారు. రూ.140 కోట్ల వ్యయంతో 300 పడకల హాస్పిటల్ భవనాలు రెండేళ్లలో పూర్తి చేశారు. ఈ భవనాలలో రిజిస్ట్రేషన్, ఉచిత ఔషధ కేంద్రం ఏర్పాటు చేశారు. రూ.20 కోట్ల వ్యయంతో 97 క్వార్టర్స్ నిర్మించారు. డాక్టర్ల కోసం 24, 3వ శ్రేణి ఉద్యోగులకు 24, 4వ శ్రేణి ఉద్యోగులకు 49 క్వార్టర్స్ నిర్మించారు. భవనం కింద ఉద్యోగులు వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా బహిరంగసభ ఏర్పాటుకు విశాలమైన మైదానంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా స్థాయి అధికారులు, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు పర్యవేక్షించారు.



జిల్లా కేంద్ర హాస్పిటల్ భవనాలు

సమస్యలు స్వాగతం..

ముఖ్యమంత్రి మోహణ చంద్ర మఝి హాస్పిటల్ భవనాలను ప్రారంభించేందుకు జయపురం ఆదివారం వస్తున్నారు. హాస్పిటల్‌లో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరిస్తారని ఈ ప్రాంత ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో 147 పదవులు మంజూరు కాగా.. ప్రస్తుతం కేవలం 57 మంది మాత్రమే ఉన్నారు. హాస్పిటల్‌లో పలు డాక్టర్ల పోస్టులతోపాటు 90 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటిలో శిశువైద్య విభాగంలో నలుగురు శిశు వైద్యుల పోస్టులు, అనాస్తియా, హృద్రోగ విభాగంలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మానసిక వ్యాధి విభాగం, పథాలజీ, రేడియోలజీ విభాగాలలో కూడా డాక్టర్లు లేరు. అవసరమైనంత మంది వైద్య నిపుణులు జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో లేరు. సుప్రీం కోర్టు ఆదేశించి రెండేళ్లు గడచినా నేటికీ ట్రమా కేర్ కేంద్రం ఏర్పాటు కాలేదు. సిటీ స్కాన్ సైకర్యం లేదు. 26, 326 జాతీయ రహదారులలో ప్రతీరోజు సగటున దాదాపు పది రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటం వలన పలువురు గాయపడుతున్నారు. నెలకు సగటున 20 మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారు. ట్రమా కేర్ కేంద్రంపై హాస్పిటల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. సిటీ స్కాన్ కొరకు రోగులు ప్రైవేట్ హాస్పిటళ్లు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీష్‌గడ్ రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తుంది. తగినంత మంది డాక్టర్లు లేకపోవటం వలన రోగులు పూర్తిస్థాయి వైద్య సేవలు పొందలేకపోతున్నారు.

431 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో గల ఉత్కల అలూమిన కర్మాగారం ఆధ్వర్యంలో సమితిలోని హాడిగుడ పంచాయతీ పరిధి లొహుగుడలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 431 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కర్మాగారం సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య నిర్వహించిన అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కర్మాగారం అధికారి సుభాష్ నాయక్, రాజేంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శక్తి సంరక్షణపై అవగాహన



జాతీయ శక్తి సంరక్షణ సమావేశంలో ముఖ్య అతిథి తదితరులు

జయపురం: సమాజ ప్రగతికి అన్ని శక్తులను పరిరక్షించుకోవాలని టాటా పవర్ విభాగ అధికారి జీవన జ్యోతి మిశ్ర అన్నారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల జిజ్ఞాత శక్తి క్లబ్బు పాఠశాల సభాగృహంలో శనివారం జాతీయ శక్తి సంరక్షణ వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవన జ్యోతి మిశ్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు శక్తిపై అవగాహన కల్పించారు. శక్తిని సమాజ ప్రగతికే వినియోగించాలని సూచించారు.

6,831 కేసులు పరిష్కారం



పర్లాకిమిడి: కేసులను పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్

రాయగడ: స్థానిక సివిల్ కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 6,831 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లాలోని గుణుపూర్, బిసంకటక్, రాయగడ, కాసీపూర్, మునిగుడ, పద్మపూర్ కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 170 కేసులను పరిష్కరించి రూ.86,94,407 జరిమాల రూపంలో సేకరించారు. రెవెన్యూ సంబంధిత 6,639 కేసులు పరిష్కరించి రూ.12,80,086, లేబర్ సంబంధిత 2 కేసులను పరిష్కరించి రూ.8,68,710 వసూలు చేశారు. ప్రీలిటిగేషన్ సంబంధిత 20 కేసులను పరిష్కరించి రూ.10,51,146 జరిమానా రూపంలో వసూలు చేశారు. జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి, స్థాయి లోక్ ఆదాలత్ అధ్యక్షుడు ఎస్.ఎ.కె. జహారా అహ్మద్, ఫ్యామిలీ కోర్టు జడ్జి సంజయ్‌కుమార్ బెహరా, అదనపు జిల్లా జడ్జి అల్పనా స్వయి, తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నాల్గో లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ అధ్యక్షుడు, జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ ప్రారంభించారు. న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవుళో పర్యవేక్షించారు. కోర్టు ప్రాంగణంలో వివిధ నేషనల్ బ్యాంకుల అధికారులు పాల్గొని కక్షిదారుల కేసులను విచారించారు. లోక్ అదాలత్‌లో మొత్తంగా 2900 కేసులుకు 1618 కేసులు విచారణకు వచ్చాయి. రూ.32,96,635 జరిమానాల రూపంలో ఆదాయం వచ్చిందని కోర్టు అధికారులు తెలియజేశారు. జిల్లాలో ఆర్.ఉదయగిరి కోర్టులో న్యాయమూర్తి పుణ్యశ్లోక రథ్, ఫష్ట్ క్లాస్ మాజిస్ట్రేట్ తరునీ కుమార్ శెఠి, ఫ్యామిలీ కోర్టులోముఖ్య విచారణ అధికారి అశోక్ కుమార్ పోహి, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ నరోత్తమ శెఠి, సీనియర్ దేవయాణి అధికారి ప్రసన్నకుమార్ బెహరా, మహిళా కోర్టులో రశ్మితా సాహు, సబ్ డివిజనల్ విచారణ అధికారి విష్ణుప్రియా సామంతరాయ్, సుభాషిష్ పాణి, తదతరులు పాల్గొన్నారు.



రాయగడ: అదాలత్ కేసులను పరిష్కరిస్తున్న జడ్జి షడంగి

లోక్‌అదాలత్‌లో 4255 కేసుల పరిష్కారం

జయపురం: జిల్లాలో ఈ ఏడాది ఆఖరి లోక్ అదాలత్‌లో 4255 కేసులు పరిష్కరించి రూ.5,60,82,657లు జరిమానా రూపంలో వసూలు చేసినట్లు జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన వెల్లడించారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా జడ్జి, న్యాయసేవా ప్రదీకరణ అధ్యక్షులు ప్రదీప్ కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా జడ్జి ప్రదీప్ కుమార్ మహంతి, అదనపు జిల్లా జడ్జి బిద్యాధర పుస్టి, సీనియర్ సివిల్ జడ్జి స్వయం ప్రకాశ దాస్, మహిళా కోర్టు జడ్జి అలకానంద మహంతి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన, రిజిస్ట్రార్ విష్ణు ప్రసాద్ దేవత, జయపురం సబ్‌డివిజన్ విభాగ జడ్జి సంతోష్ కుమార్ బారిక్, ప్రథమ శ్రేణి జడ్జి అనిమేష్ జెన తదితరులు పాల్గొన్నారు. కొరాపుట్, కొట్‌పాడ్, లక్ష్మీపూర్, సెమిలిగుడ, బొరిగుమ్మ, దసమంతపూర్, లమతాపుట్ లలోగల కోర్టుల పరిసరాల్లో కూడా జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించారని వెల్లడించారు.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి

కను విందుగా శ్రీ నృత్యోత్సవం – 2024

భువనేశ్వర్: శ్రీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక రవీంద్ర మండపంలో శ్రీ నృత్యోత్సవం -2024 ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవం రెండు రోజుల పాటు కొనసాగుతుంది. ఒడిస్సీ నృత్య కళాకారిణి గురు స్నేహ ప్రభ సామంతరాయ్ జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఉత్సవం తొలి రోజున గురు నమితా రే ఆధ్వర్యంలో శ్రీ డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల బృందం రిథమ్ గురు సచ్చిదానంద దాస్ స్వరపరిచిన సంగీతానికి ఒడిస్సీ నృత్యం ప్రదర్శించారు. సంగీతా దాస్ స్వరపరిచిన జయదేవ్ గీత గోవింద నుంచి అభినయ యాహీ నాధవ సోలో ఒడిస్సీ నృత్య ప్రదర్శన అలరించింది. గోకుల్‌శ్రీ దాస్, రబీ శంకర్ మాఝీల ఒడిస్సీ యుగళ గీతం శాస్త్రీయ నృత్య ప్రదర్శన, షర్మిలా భట్టాచార్య ఆధ్వర్యంలో కథక్ నృత్యం కొన మెరుపుగా నిలిచాయి. కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ఒడియా భాష, సాహిత్యం – సంస్కృతి శాఖ, ఒడిషా సంగీత నాటక అకాడమీ, యుఫోరియా, ఇంఫా, తదితర ప్రముఖ సంస్థల సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.









శ్రీ నృత్యోత్సవంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

క్లుప్తంగా

లారీలకు అపరాధ రుసుం



స్టేషన్‌కు తరలించిన లారీలు

బొబ్బిలి: పట్టణం గుండా అధిక లోడ్లతో వెళ్తున్న మూడు లారీలను సీఐ కె.సతీష్‌కుమార్ శనివారం పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి ఒడిశా వెళ్తున్న మూడు మాంగనీస్ లోడ్ల లారీలను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. రెండు లారీలకు రూ.30వేలు చొప్పున, రూ.54వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు.

కేరళలో పోటీలకు 'జీసీఎస్ఆర్' విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం సిటీ: శ్రీకాకుళం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వాలీబాల్ పురుషుల జట్టుకు స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ సీహెచ్ కేశవనారాయణ శనివారం తెలిపారు. ఇటీవల వర్సిటీలో జరిగిన ఎంపిక పోటీల్లో కళాశాలకు చెందిన ఎం.విశ్వకర్మ మహదేవ్, ఎం.హేమంత్‌కుమార్, కె.మణికంఠ, ఎం.గౌరీశంకర్‌లు పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో ఎంపికయ్యారన్నారు. వీరంతా ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జడ్జి శారదాంబ

రాజాం సిటీ: లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె.శారదాంబ అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పే అంతిమ తీర్పు అని, రాజీయే రాజమార్గమని, ప్రతి ఒక్కరూ రాజీమార్గాన్ని అనుసరించాలన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసుల పరిష్కారంతో పాటు చట్టరీత్యా రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులను కూడా ఉభయ పార్టీల అంగీకారంతో పరిష్కరించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన సివిల్ కేసుల కోర్టు ఫీజు వాపసు పొందవచ్చన్నారు. అనంతరం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 295 కేసులు పరిష్కరించారు. ఈ కేసులను రూ.42,00,499ల నగదుకు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి వెల్లడించారు. పరిష్కరించిన కేసుల్లో సివిల్ కేసులు 11 ఉండగా, క్రిమినల్ కేసులు 165, చెక్‌బౌన్స్ కేసులు 9, సారా కేసులు 110 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాజాం జూనియర్ సివిల్ జడ్జి పీఎస్ వీబీ కృష్ణసాయితేజ, రాజాం బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల మరమ్మతులకు ప్రత్యేక విధానం

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



పాడైన వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్న వాహనాల మరమ్మతులకు ప్రత్యేక విధానాన్ని రూపొందించనున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని మేదరవీధి ప్రాంతంలో ఉన్న వెహికల్ డిపోను డీఈ శ్రీనివాసరావు, తదితరులతో కలిసి శనివారం పరిశీలించారు. డిపోలో పాడైన వాహనాలు ఎక్కువగా ఉండడానికి గమనించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేకమైన మెకానిక్‌ను ఏర్పాటు చేసి, వెల్డింగ్ మిషన్, ఇతర యంత్రాలు సమకూర్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ ఏ విధంగా ఉందో గమనించారు. కొన్నిచోట్ల రహదారులు ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేయడాన్ని చేసి వాటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

- ఎస్ఎస్‌సీ ఫలితాల్లో సత్తా చాటారు
- మంతిన పంచాయతీలో ఐదుగురికి కొలువులు
- మల్లయ్యపేటకు చెందిన నలుగురి ఎంపిక



పేదింటి బిడ్డలు.. ఎస్ఎస్‌సీలో మెరిశారు...

సంతకవిటి: మండల పరిధిలోని మంతిన పంచాయతీలో మంతిన, మల్లయ్యపేట గ్రామాల నుంచి పేద, రైతు కుటుంబాలకు చెందిన ఐదుగురు శుక్రవారం రాత్రి వెలువడిన ఎస్ఎస్‌సీ ఫలితాలలో మంచి మార్కులు సాధించి ఉద్యోగాలు సాధించారు. మల్లయ్యపేట గ్రామం నుంచే నలుగురు ఎంపిక కావడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఒక చిన్న గ్రామంలో నలుగురికి ఉద్యోగాలు రావడంతో వాళ్ల ఆనందానికి హద్దు లేకుండా పోయింది. వీళ్లందరూ పేద, రైతు కుటుంబాలకు చెందిన వారే. ఉద్యోగాల్లో మెరిసిన ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. వివరాల్లోకి వెళ్తే...

ఉద్యోగం సాధించిన రైతుబిడ్డ



బొడ్డేపల్లి రాజశేఖర్

మల్లయ్యపేట గ్రామానికి చెందిన బొడ్డేపల్లి రాజు, సత్యవతి దంపతులు పొలం పనులు చేస్తూ తమ పిల్లలను చదివించారు. మొదటి కుమారుడు బొడ్డేపల్లి రాజశేఖర్ తొలుత నెల్లూరులో హోటల్‌లో పనిచేసి తరువాత తెలంగాణలోని కరీంనగర్‌లో ఉంటూ పరీక్షకు సమాయత్తమయ్యాడు. ఈ క్రమంలో గత ఫిబ్రవరిలో ఎస్ఎస్‌సీ పరీక్ష రాశాడు. శుక్రవారం అర్ధరాత్రి వెలువడిన ఫలితాలలో 107.34 మార్కులు సాధించి బీఎస్ఎఫ్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

వ్యవసాయ కుటుంబం నుంచి..



పొట్నూరు శివప్రసాద్

మల్లయ్యపేట గ్రామానికి చెందిన పొట్నూరు వేణుగోపాలరావు, పద్మావతి దంపతుల తొలి సంతానం శివప్రసాద్. ఈయన విజయనగరంలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. 103.63 మార్కులు సాధించి సీఆర్‌పీఎఫ్‌కు ఎంపికయ్యారు. కుమారుడికి ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

ఐటీఐ చదివి..



పేడాడ మోహన్

మంతిన గ్రామానికి చెందిన పేడాడ సూర్యనారాయణ, సన్యాసమ్మల కుమారుడు మోహన్. ఐటీఐ చదివి దీవీస్ ల్యాబ్‌లో రెండేళ్లపాటు ఉద్యోగం చేశాడు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కృతనిశ్చయంతో పోటీ పరీక్షలకు సమాయత్తమయ్యాడు. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 113 మార్కులు సాధించి సీఆర్‌పీఎఫ్‌కు ఎంపికయ్యాడు. రైతులైన ఈయన తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు.

తల్లి కష్టంతో..



పేడాడ భవాని

మల్లయ్యపేట గ్రామానికి చెందిన పేడాడ భవాని ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 101.67 మార్కులు సాధించి బీఎస్ఎఫ్‌కు ఎంపికైంది. ఈమె తండ్రి గోవిందరావు చిన్నతనంలోనే మరణించడంతో తల్లి కూలి పనులు చేసి చదివించింది. డిగ్రీ పూర్తయిన వెంటనే ఒక సంవత్సరం పాటు పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించింది.


తల్లిదండ్రుల కష్టంతోనే...



పోతిన శివప్రసాద్

మల్లయ్యపేట గ్రామానికి చెందిన పి.నారాయణరావు, గాయత్రి దంపతుల కుమారుడు శివప్రసాద్. డిగ్రీ అయిన వెంటనే హైదరాబాద్ వెళ్లి పోటీ పరీక్షలకు సమాయత్తం కావడంతో ఎస్ఎస్‌సీలో 114 మార్కులు సాధించి అస్సాం రైఫిల్‌కు ఎంపికయ్యాడు. పొలం పనులు చేస్తూ చదివించిన తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాడు.

ఒకేసారి రెండు ఉద్యోగాలకు..



చౌదరి సిసింద్రీ

భామిని: మండలంలోని పాత ఘనసరకు చెందిన చౌదరి సిసింద్రీ ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఎస్ఎస్‌సీలో పరీక్ష రాసి సీఐఎస్ఎఫ్‌కు, మరోవైపు సీఆర్‌పీఎఫ్ ట్రేడ్స్‌మన్‌గా ఎంపికయ్యాడు. సిసింద్రీ విజయనగరంలోని ఎంఆర్ కళాశాలలో బీఎస్సీ చదివి ఎన్‌సీసీలో శిక్షణ పొందాడు. ఈయన తల్లిదండ్రులు చౌదరి రవణమ్మ, జగన్నాథం మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు.

జర్నలిస్టులపై దాడి హేయం



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

సాలూరు: వైఎస్సార్ కడప జిల్లాలో వేముల మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలను కవర్ చేయడానికి వెళ్లిన సాక్షి బృందంపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సాలూరు పట్టణం, మండలంలో పలువురు జర్నలిస్టులు డిమాండ్ చేసారు. సాక్షి విలేకరులపై దాడికి నిరసనగా శనివారం పట్టణంలో జాతీయ రహదారిపై, తహసీల్దార్ కార్యాలయ ఆవరణ వద్ద ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసన తెలిపారు. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నివారించి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఇకపై ఏ ప్రాంతంలోను జర్నలిస్టులపై దాడులు చేయకుండా చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. తహసీల్దార్ ఎన్‌వీ రమణకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పట్టణ, మండల జర్నలిస్టులు నల్లి శ్రీనివాసరావు, బాలి విశ్వేశ్వరరావు, రాపాక కూర్మారావు, చింతాడ సుబ్రహ్మణ్యం, రామ్మోహన్, చంద్రమౌళి, కృష్ణ, నాగేశ్వరరావు, శ్రీకాంత్, అశోక్, వాసు, సూర్యనారాయణ శ్యామ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మద్దతు

నిరసన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మద్దతు తెలిపారు. జర్నలిస్టులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియాపై దాడులు అమానుషమన్నారు. దాడులు చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. జర్నలిస్టులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు.

ఉపాధిహామీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

పార్వతీపురంటౌన్: ఎస్సీ, ఎస్టీ ఉపాధిహామీ ఉద్యోగుల జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టెక్నికల్ అసిస్టెంట్ గంటా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా మందంగి హరనాథ్, తుట్ట తిరుపతి, కార్యదర్శిగా ఈసీ చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీగా ప్రసాద్, ట్రెజరర్‌గా భద్ర వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

భయపెడుతున్న గజరాజులు



నందివానివలస తామరచెరువులో జలకాలాడుతున్న ఏనుగులు

గరుగుబిల్లి: మండల ప్రజలను గజరాజులు భయపెడుతున్నాయి. గిజబ, నందివానివలస పొలాలు, తోటల్లో శనివారం సంచరించాయి. నందివానివలసలోని తామరచెరువులో ఉదయం జలకాలాడుతూ కనిపించాయి. ప్రస్తుతం వ్యవసాయ పొలం పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో ప్రజలు తిరుగాడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం తలపెడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల తరలింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

సీతానగరం: మండలంలోని వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో ఆయకట్టుదారులతో సాగునీటి సంఘం ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద పి.నారాయణరావుపై చేయి చేసుకున్నారనే కారణంతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. శనివారం ఉదయం అంటిపేట ఎంపీఈపీ పాఠశాల ఆవరణలో వీఆర్ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో రైతులతో ఆయకట్టు సంఘం ఎన్నిక నిర్వహించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన వారిలో కొందరు రైతులు ఎన్నిక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. మరి కొంతమంది ఎన్నిక ఆలస్యంగా నిర్వహించేందుకు తాత్సారం చేయడంతో అది కాస్త వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో అంటిపేట గ్రామానికి చెందిన తిరుపతిరావుతో పాటు మరో ఐదుగురు తనను కొట్టారని రామవరం గ్రామానికి చెందిన పి.నారాయణరావు చేసిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

భావితరాలకు వెలుగునిద్దాం..



మానవ హారం నిర్వహిస్తున్న ఉద్యోగులు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు వెలుగునిద్దామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను శనివారం జెండా ఊపి ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఆర్అండ్‌బీ, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా బాలాజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ దేశంలో విద్యుత్ వినియోగం పెరిగిపోతోందన్నారు. దీనిని తగ్గించే ఉద్దేశంతో సంప్రదాయేతర ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మహోద్యమంగా విద్యుత్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సౌర శక్తి వినియోగం ఇటీవల కాలంలో బాగా పెరుగుతోందని తెలిపారు. ఇంధన పొదుపు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతి ఏటా డిసెంబర్ 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ తరాల కోసం ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈఈలు పి.త్రినాథరావు, జి.సురేష్‌బాబు, పి.మురళీకృష్ణ, డీఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అరటి, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో అరటి, జీడిమామిడి ప్రోసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో జీడి మామిడి పంట అధికంగా ఉందని, విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తే రైతులకు మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉందన్నారు. దీనికోసం ప్రోసెసింగ్ యూనిట్లను నెలకొల్పేటట్టు అవగాహన కల్పించాలన్నారు. సాలూరు, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో జీడి ప్రోసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు ప్రాథమిక నివేదిక తయారు చేయాలన్నారు. జీడి పంట సేకరణకు స్వయం సహాయక సంఘాలు, గిరిజన సహకార సంఘం సూచనలను తీసుకుంటే మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉంటుందన్నారు. ప్రోసెసింగ్ యూనిట్లపై ఉద్యాన శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి యూనిట్ల లాభదాయకతపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాలూరు, జియ్యమ్మవలస, మక్కువ మండలాల్లో అరటి పంట విస్తృతంగా ఉందని, వాటిని సద్వినియోగం చేసుకొనేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, హార్టీకల్చర్ అధికారి మణిభూషణ్, జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు పద్మజ, ఐటీడీఏ ఏపీఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్స్ బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ పురుషుల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల బృందం సిద్ధమైంది. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి 10 విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించగా... అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుంచి 20వ తేదీ వరకు పిఠాపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మధకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, అసోసియేషన్ జిల్లా సభ్యులు ఎస్‌ఈ రాజు, రింగ్ అఫీషియల్స్ వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, సీనియర్ బాక్సర్‌లు బి.మనీష్, జె.ప్రసాద్, బి.వికాస్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపు భవితకు మదుపు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ ఎస్.ఎస్.శోభిక

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: ఇంధన పొదుపు భవితకు మదుపని.. ప్రతిఒక్కరూ ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అన్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శనివారం జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులను వినియోగించడం వల్ల 60 శాతం విద్యుత్‌ను ఆదా చేయొచ్చన్నారు. ఇంధనాన్ని ఆదా చేస్తే భావితరాలకు భరోసా ఇవ్వగలమని తెలిపారు. ఇంటిపై సోలార్ పలకల ఏర్పాటుతో జల, థర్మల్ విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతిరావు మాట్లాడుతూ ఇంధన పొదుపుపై పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని, స్వయం సహాయక మహిళా బృందాలకు ముగ్గుల పోటీలు, ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానము అనే అంశముపై నిష్ణాతులతో ఎమ్మార్‌నగరం పాలిటెక్నిక్ కళాశాలలో వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో విజేతలకు ఈ నెల 20న బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీరు వేణుగోపాలనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

- మొత్తం 492 కేసులు రాజీ
- రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు



కేసులు రాజీపరుస్తున్న రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురంటౌన్: జాతీయ లోక్ అదాలత్‌తో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు అవకాశం కలుగుతుందని పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జిల్లా జడ్జి కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఎక్సైజ్ 57, చెక్ బౌన్స్ 2, ఐపీసీ 57, సమరీ ట్రయిల్స్ 342, ప్రీ లిటిగేషన్ 5, రోడ్డు ప్రమాదాల పరిహారం 8, సివిల్ 18, క్రిమినల్ 3 కలిపి మొత్తం 492 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించామన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉండి, సమర్థవంతమైన న్యాయాన్ని అందించాలన్నదే లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశమన్నారు. పెండింగ్‌లో ఉన్న వివాహ, ఆస్తి వివాదాలు, మోటారు ప్రమాద క్లైమ్‌లు, భూసేకరణ, పరిహారం, సర్వీస్, లేబర్‌కు సంబంధించిన కేసులతో సహా సెటిల్‌మెంట్ అంశాలు కలిగి ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంతో దూరం నుంచి కక్షిదారులు కోర్టులకు వస్తున్నారని, లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వల్ల వారికి మానసిక ఒత్తిడితో పాటు ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు ఎం.వెంకటరమణ, ఎస్.కృష్ణ, కె.బాపూజీ, జి.లక్ష్మణరావు, ఆర్.గంగరాజు, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.